
సాక్షి చిత్తూరు

సోమవారం । 6 । మే । 2024



సంక్షేమం విరిసె..

కుప్పం నియోజకవర్గంలో ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా సాక్షి బృందం రోడ్ షో నిర్వహించింది.

- 8లో



వైఎస్సార్‌సీపీలోకి వలసలు

జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో వివిధ పార్టీల నుంచి నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు.

- 8లో



శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. టికెట్ లేని వారికి సుమారు 12 గంటల్లో శ్రీవారి దర్శనమవుతోంది.

- 8లో

న్యూస్‌రీల్

పకడ్బందీగా 'పోస్టల్' పోలింగ్



పూతలపట్టు : పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ ఆదేశించారు. ఆదివారం పూతలపట్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటీ సెంటర్‌ను సందర్శించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఐదు పోలింగ్ బూత్‌లలో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించే పద్ధతిని పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పోస్టల్ ఎన్నికలను నిర్వహించాలని, ఓటర్లకు పక్కాగా మౌలిక వసతులు ఆర్‌డీఓ చిన్నయ్యకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా బందోబస్తు కల్పించాలని స్పష్టం చేశారు.

టీడీపీ ప్రచారంలో 104 నర్సు



టీడీపీ అభ్యర్థికి హారతి ఇస్తున్న ఆశ

పుంగనూరు : టీడీపీ పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి ఆదివారం సోమల మండలం కందూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచారంలో ఆశ అనే 104 నర్సు పాల్గొన్నారు. స్థానిక మహిళలతో కలిసి టీడీపీ అభ్యర్థికి హారతులు ఇచ్చారు. నిబంధనలు ఉల్లంఘించిన నర్సుపై చర్యలు తీసుకోవాలని అధికారులకు వైఎస్సార్‌సీపీ నేతలు ఫిర్యాదు చేశారు.

దళిత ద్రోహి మందకృష్ణ

చిత్తూరు రూరల్(కాణిపాకం): మందకృష్ణ మాదిగ దళిత ద్రోహి అని ఎమ్మార్పీఎస్, మాల మహానాడు నాయకులు వరదరాజులు, అశోక్ రాజ్ విమర్శించారు. ఆదివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణకు చెందిన మందకృష్ణ మాదిగ ఇక్కడ టీడీపీకి మద్దతు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన స్వార్థ రాజకీయాల కోసం మాదిగలను తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. మాల..మాదిగల మధ్య చిచ్చుపెట్టిన టీడీపీకి మద్దతు ప్రకటించడమేంటని ప్రశ్నించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు అగ్రవర్ణాలకు మంత్రి పదవులు కట్టబెట్టి, దళితులను దూరం పెట్టారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే దళితులకు మేలు జరిగిందన్నారు. హోంమంత్రి, డిప్యూటీ సీఎం వంటి పదవులు దక్కాయని వివరించారు. దళితుల అభ్యున్నతికి కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీకే మద్దతు ఉంటుందని వెల్లడించారు. సమావేశంలో రమేష్, జయ శేఖర్, నవీన్, చిన్న రాయుడు, ధనుంజయలు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థికి కోపమొచ్చింది!

చిత్తూరు రూరల్(కాణిపాకం):మీడియా ప్రశ్నలకు టీడీపీ ఎంపీ అభ్యర్థికి కోపమొచ్చింది. పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు అలిగి వెళ్లిపోయారు. ఆదివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్‌కు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు హాజరయ్యారు. తొలుత ఆయన చిత్తూరు ఏం చేయాలనుకుంటున్నారో వివరించారు. ఆ తర్వాత పలు అంశాలపై పాత్రికేయులు ప్రశ్నల వర్షం కురిపించడంతో సమాధానం చెప్పలేక గుటకలు మింగారు. ఇలాంటి ప్రశ్నలు వేస్తారేంటి అంటూ చల్లగా అక్కడ నుంచి జారుకున్నారు.

బూటకాల బాబు





చిత్తూరులో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన అశేష జనసందోహం (ఇన్‌సెట్) మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, పక్కన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు, జెడ్పీ చైర్మన్

"ఎన్నికలు వస్తే బూటకాల చంద్రబాబు బయటకు వస్తారు.. ఓట్ల కోసం మాయమాటలు చెబుతారు.. పక్క రాష్ట్రాల మేనిఫెస్టోలను సైతం యథేచ్ఛగా కాపీ కొట్టేస్తారు.. బడ్జెట్‌కు మించి పథకాలు అమలు చేస్తామని కల్లబొల్లి కబుర్లు వల్లిస్తారు.. అలవి కాని హామీలను గుప్పిస్తారు.. నమ్మి ఓటేస్తే నిర్మోహమాటంగా నట్టేట్లో ముంచేస్తారు.. భవిష్యత్‌ను రంగులమయం చేస్తానంటూ పేదల ఆశపెట్టి నిస్సిగ్గుగా మోసం చేసేస్తారు.. ఇదీ చంద్రబాబు సుదీర్ఘ 40 ఏళ్ల రాజకీయ అనుభవం'' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. ఆదివారం చిత్తూరులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు.

- ఇచ్చిన హామీలను నెరవేర్చని ఘనుడు
- ఓట్ల కోసమే చంద్రబాబు మయామాటలు
- సీకే బాబు.. ఆరణితోనే చిత్తూరు వెనుకబాటు
- వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిత్తూరు కార్పొరేషన్ : చంద్రబాబునాయుడు ఎప్పుడూ మాట మీద నిలబడరని, 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే నెరవేర్చలేదని, మళ్లీ ఇప్పుడు కొత్తగా పక్క రాష్ట్రాల పథకాలను కాపీ కొట్టి మేనిఫెస్టో విడుదల చేశారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. ఆదివారం చిత్తూరులో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జగన్ అంటే నమ్మకమని, బాబు అంటే అబద్ధమని స్పష్టం చేశారు. గతంలో రైతు రుణమాఫీ, డ్వాక్రా సంఘాల రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి అంటూ నోటికొచ్చిన హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే తుంగలో తొక్కేశారని ఆరోపించారు. ఇప్పుడు మళ్లీ మోసపు వాగ్దానాలతో ప్రజల ముందుకు వస్తున్నారని, నమ్మితే మునిగిపోవడం తథ్యమని హెచ్చరించారు.

వెనుకబడ్డ చిత్తూరు

మాజీ ఎమ్మెల్యే సీకేబాబు వైఖరితో చిత్తూరు చాలా నష్టపోయిందన్నారు. ఆయన రౌడీయిజం కారణంగా చిత్తూరుకు రావాలంటే ఇతర ప్రాంతాలవారు భయపడ్డారని తెలిపారు. ఇతర జిల్లాలకు కార్పొరేట్ కంపెనీలు క్యూ కడుతుంటే చిత్తూరు మాత్రం వెనుకబడిందన్నారు.ఈ క్రమంలోనే ఆరణి శ్రీనివాసులును చిత్తూరు ఎమ్మెల్యేగా గెలిపిస్తే విశ్వాసం లేకుండా జనసేనకి వెళ్లారని మండిపడ్డారు. ఇక్కడ భూములన్నీ కబ్జా చేసేసి, ఇప్పుడు తిరుపతిపై పడ్డారని ఆరోపించారు.

కరోనా సమయంలో గురజాల ఎక్కడ?

జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ కరోనా సమయంలో టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. బీసీ నేత రావూరి ఈశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ కోసం రూ.కోట్లు ఖర్చు పెట్టి ఆ పార్టీ గెలుపునకు కారణమైతే అధికారంలో వచ్చాక మోసంచేశారని మండిపడ్డారు. రూ.300 కోట్లు విలువైన తన ఫ్యాక్టరీని నలుగురు నాయకులు కుట్రపన్ని మూయించారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా మాజీ అధ్యక్షులు గాయత్రిదేవి మాట్లాడుతూ కనకనేరి గ్రామంలో ఎస్సీ, ఎస్టీలను టీడీపీ అభ్యర్థి గురజాల అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సరళామేరి, పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు లీనారెడ్డి పాల్గొన్నారు.

మేనిఫెస్టో కూడా కాపీనే

చంద్రబాబుకు ఎప్పుడూ ఒంటరిగా పోటీచేసే ధైర్యం లేదని, మేనిఫెస్టోను సైతం సొంతంగా ప్రకటించే దమ్ము లేదని మంత్రి పెద్దిరెడ్డి విమర్శించారు. ప్రస్తుతం ఆయన ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే ఏడాదికి రూ.1.65 లక్షల కోట్లు కావాలని, అందుకే ఆయన మాటల్ని ప్రజలు ఏమాత్రం నమ్మే పరిస్థితి లేదన్నారు. అధికారంలోకి వస్తే రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ చేసిన సంస్కృతి చంద్రబాబుదని, అందులో ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5తోపాటు దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ కూడా భాగస్వామ్యమేనని ఆరోపించారు. బడా వ్యాపారవేత్తలు, డబ్బుండే నాయకులు, సొంత ఆస్తులు పరిరక్షణే కోసమే చంద్రబాబు అధికారం కోరుకుంటున్నారని తెలిపారు.

ప్రజాసేవే పరమావధి

ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప మాట్లాడుతూ జిల్లాలోని ఒక పార్లమెంట్, 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జగనన్న ఆశీస్సులు, మంత్రి పెద్దిరెడ్డి నాయకత్వంలో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి మాట్లాడుతూ ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తున్నామని, తమను ఆశ్వీరదించాలని అభ్యర్థించారు. గత పాలకుల శాపాలతోనే చిత్తూరు అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరి రౌడీయిజం కారణంగా ఎన్నో కుటుంబాలు దిక్కులేకుండా పోయాయని, మరొకరి భూదాహం కారణంగా రూ.వందల కోట్ల ప్రజాధనం లూటీ అయ్యిందని విమర్శించారు.

కష్టం వస్తే ఆదుకుంటూ..

వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి పదేళ్లుగా చిత్తూరు ప్రజలకు సేవ చేస్తున్నారని, కష్టం వస్తే ఆదుకుంటున్నారని మంత్రి పెద్దిరెడ్డి వెల్లడించారు. సీకేబాబు లాంటి రౌడీని ఎదుర్కోవాలంటే తెలివైన విజయానందరెడ్డికే సాధ్యమన్నారు. ఈ పర్యాయం అధికారంలోకి రాగానే అడవిపల్లె రిజర్వాయర్ నుంచి చిత్తూరుకు శాశ్వతంగా నీటి సరఫరా చేయిస్తామని తెలిపారు. ఔటర్ రింగ్‌రోడ్డు, ఇంటర్ రోడ్డు కనెక్టవిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో గ్రానైట్ ఫ్యాక్టరీలు ఎక్కువగా ఉన్నాయని, వాటికి రాయితీలను మరింత పెంచేందుకు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. డబ్బులు పంచి, దొంగ ఓట్లతో గెలవాలని టీడీపీ యత్నిస్తోందన్నారు. చిత్తూరు ఎంపీగా రెడ్డెప్పను, ఎమ్మెల్యేగా విజయానందరెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

పేదల అభ్యున్నతే జగన్ అజెండా

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం పేదల అభ్యున్నతి కోసమే అధికారంలోకి రావాలనుకుంటున్నారని మంత్రి పెద్దిరెడ్డి వివరించారు. ఐదేళ్లలో 99శాతం హామీలు నెరవేర్చిన ఘనత దేశంలోనే జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. అందుకే అమలు చేసే పథకాలతోనే నిర్భయంగా ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడుగుతున్నామని వెల్లడించారు. పేదరికమే కొలమానంగా సంక్షేమ పథకాలు అందిస్తామని, మేనిఫెస్టోలో సీఎం జగన్ చేసేదే చెప్పారని స్పష్టం చేశారు.

సేవా ముసుగులో థామస్ దోపిడీ



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం : ప్రజా సేవ ముసుగులో టీడీపీ అభ్యర్థి థామస్ భారీ దోపిడీ చేస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆరోపించారు. ఆదివారం మండలంలోని వేణుగోపాలపురం ఎస్సీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. దళితులను పావుగా వాడుకుని వారికి రూ. 200 చొప్పున ఇస్తూ సమాజానికి సేవ చేస్తున్నట్లుగా ఫోటోలు తీయించి దేశంలోని చర్చిలు, పాస్టర్లకు పంపి రూ.వందల కోట్లు వసూలు చేస్తున్నారని విమర్శించారు. అలాంటి అక్రమార్కుడు నేను అవినీతికి పాల్పడ్డానని ఆరోపించడం సిగ్గుచేటన్నారు. దళితులంటే గిట్టని చంద్రబాబు పార్టీలో చేరి ఎస్సీలపై కపటప్రేమను ఒలకబోస్తున్నారని మండిపడ్డారు. మద్యం మత్తులో కారు నడుపుతూ ప్రమాదం జరిగితే ఆ ఘటననూ రాజకీయ కోణంలో చూపి నేను చంపేందుకు కుట్ర చేస్తున్నానని థామస్ దుష్ప్రచారం చేశారని వెల్లడించారు. ఆయనను చంపాల్సిన అవసరం తనకు లేదని స్పష్టం చేశారు. తన రాజకీయ అనుభవం ముందు థామస్ ఒక బచ్చా అని తెలిపారు. తన ఇంట్లో తిని, పెరిగి ఇప్పుడు తన కుమార్తె కృపాలక్ష్మిపై అసత్య ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి దెయ్యాల రమేష్‌కు విశ్వాసం లేదని వివరించారు. తన పిల్లలు బాగా చదువుకుని చక్కగా సంపాదించుకుంటున్నారని, అవినీతికి పాల్పడాల్సిన ఖర్మ తనకు లేదని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. కుటుంబాల మధ్య చిచ్చు పెట్టడం టీడీపీ, కాంగ్రెస్ నేతలకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. ముద్రగడకు ఆయన కుమార్తెకు రచ్చ పెట్టారని, సీఎం జగనన్నకూ షర్మిలమ్మకు గొడవ పెట్టారని, రాజకీయ స్వార్థం కోసం కుటుంబాలను విభజిస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 13వ తేదీతో అందరి భ్రమలు తొలగిపోతాయని వెల్లడించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కాళ్లు పట్టుకుని ప్రజలను బురిడీ కొట్టించేందుకు చంద్రబాబు పన్నాగం పన్నారని ఆరోపించారు. బాబు మేనిఫెస్టో బూటకమని తెలిసి బీజేపీ చేతులుదులుపుకుంటోందని వివరించారు. ముస్లిం రిజర్వేషన్లు తొలగిస్తామంటూ చెబుతున్న బీజేపీకి ఈ ఎన్నికల్లో మూడిందన్నారు. పేదల జీవితాల్లో నెలకొన్న చీకటిని తొలగించే సూర్యుడు జగనన్న అని కొనియాడారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం తథ్యమని స్పష్టం చేశారు.

ఓటెత్తిన ఉద్యోగులు

- జిల్లాలో 74.34 శాతం పోలింగ్



పోలింగ్‌ను పర్యవేక్షిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి

చిత్తూరు కలెక్టరేట్: ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు ఆదివారం తమ పోస్టల్ బ్యాలెట్‌లను వినియోగించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో ఉద్యోగులు ఓటు వేశారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్ కొనసాగింది. పోలింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్‌ఓ పుల్లయ్య పర్యవేక్షించారు. ఈ నెల 8వ తేదీ వరకు ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అవకాశముంది.

జిల్లా వ్యాప్తంగా మొదటి రోజు అసెంబ్లీ, పార్లమెంట్‌కు 74.34 శాతం పోస్టల్‌బ్యాలెట్ పోలింగ్ అయ్యింది. అత్యధికంగా నగరి నియోజకవర్గంలో 83.04 శాతం ఓట్లు పోలయ్యాయి. అలాగే పుంగనూరులో 76.39 శాతం, జీడీ నెల్లూరులో 79.53 శాతం, చిత్తూరులో 65.09 శాతం, పూతలపట్టులో 75.46 శాతం, పలమనేరులో 71.32 శాతం, కుప్పంలో 73.29 శాతం పోస్టల్‌బ్యాలెట్ ఓట్లు పోలైనట్లు అధికారులు వెల్లడించారు. అనంతరం పోలైన పోస్టల్ బ్యాలెట్ బాక్సులకు సీల్ వేసి రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారు.



పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఉద్యోగులు

టీడీపీ ప్రలోభాలను పట్టించుకోరేం!

- చిత్తూరు పోలీస్ స్టేషన్ ఎదుట వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానందరెడ్డి నిరసన
- టీడీపీ నేతలు డబ్బుతో దొరికినా వదిలేయడంపై ఆగ్రహం



నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

చిత్తూరు అర్బన్: ఎన్నికల సందర్భంగా చిత్తూరులో టీడీపీ నేతలు విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లుతుంటే.. పోలీసులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారంటూ చిత్తూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంసీ విజయానందరెడ్డి పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ నాయుడు తరఫున అతని మామ జయచంద్ర నాయుడు మిట్టూరులో ఓటర్లకు డబ్బులు పంచుతుండగా.. సమాచారం అందుకున్న విజయానందరెడ్డి ప్రజలతో కలిసి జయచంద్ర నాయుడు, అతని అనుచరుడు పట్టాభిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు సమాచారం ఇవ్వగా.. వాళ్లు వచ్చి నిందితుల నుంచి రూ.96,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితులు ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. కొద్దిసేపటి తర్వాత జయచంద్ర నాయుడును పోలీసులు పంపించేశారని విజయానందరెడ్డి ఆరోపించారు. బెంగళూరు, అనంతపురం నుంచి పెద్దసంఖ్యలో వచ్చిన వ్యక్తులు చిత్తూరులో తిష్టవేసి కూర్చున్నారన్నారు. ఇక్కడి టీడీపీ నేతలు భాస్కర హోటల్ కేంద్రంగా ఓటర్లకు భారీఎత్తున డబ్బులు వెదజల్లుతున్నారన్నారు. దీనిపై ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు సమాచారం ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. బయటి వ్యక్తులను వెంటనే ఇక్కడినుంచి పంపించేయాలనే డిమాండ్ చేశారు. ఎన్నికల అధికారులు, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి చిత్తూరులో సజావుగా ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. టీడీపీ అభ్యర్థి బంధువును స్వయంగా పట్టుకుని అధికారులు అప్పగిస్తే ఎలా వదిలేస్తారని ప్రశ్నించారు. పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ తీరుకు నిరసనగా గంటకు పైగా విజయానందరెడ్డి స్టేషన్ వద్ద అర్ధనగ్నంగా బైఠాయించగా.. నిందితులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు. ఈ సందర్భంగా విజయానందరెడ్డి మాట్లాడుతూ.. పోస్టల్ బ్యాలెట్‌లోనూ ఉద్యోగులను ప్రలోభాలకు గురిచేసిన టీడీపీ నాయకులు ఒక్కో ఓటుకు రూ.2,500 చొప్పున నగదు పంచుతూ ఓట్లు కొంటున్నారని ఆరోపించారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులకు టీడీపీ నాయకులు కార్లను సమకూర్చడం, భోజనాలు ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. దీనిపై రాష్ట్ర ఎన్నికల అధికారులకు సైతం ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

జనరంజకంగా జగనన్న పాలన



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజకంగా పాలన అందించారని, ప్రజలతోనే ఆయన కూటమి కట్టారని మంత్రి, నగరి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజా వెల్లడించారు. ఆదివారం పుత్తూరులోని 17, 20వ వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. మంత్రి మాట్లాడుతూ జగనన్న తన ఐదేళ్ల పాలనలోనే అద్భుతాలు చేశారని చెప్పారు. ఏపీలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం ప్రశంసించారని తెలిపారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరింత అభివృద్ధి జరగాలన్నా మరోసారి జగనన్నకు సీఎంగా అవకాశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. గత చంద్రబాబు పాలనలో సంక్షేమం ఊసే లేదని, అభివృద్ధి అటకెక్కిందని విమర్శించారు. జగనన్న 99 శాతం హామీలను నెరవేర్చి సరికొత్త చరిత్ర సృష్టించారని, చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశారని వివరించారు. జగనన్న ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల లబ్ధి చేకూరిందని చెప్పారు. ఇలా చేసింది చెప్పుకోడానికి ఏమీ లేక పలు పార్టీలతో కూటమి కట్టి వస్తున్న చంద్రబాబును చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. నగరి నుంచి తనను ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, కౌన్సిలర్లు జయలక్ష్మి, చిట్టిబాబు, నాయకులు పాండురంగయాదవ్, మునయ్య, లోకనాథరెడ్డి, మనోహర్‌రెడ్డి, కడియాలనాయుడు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే ఉద్యోగులకు మేలు

పుత్తూరు: ప్రతి ఉద్యోగి ఓటు ఫ్రెండ్లీ ఎమ్మెల్యే అయిన తనకే వేస్తారని మంత్రి, నగరి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజా ధీమా వ్యక్తం చేశారు.ఆదివారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఉద్యోగులకు అండగా నిలిచారని తెలిపారు. జీతాల పెంపు, పనిభారం తగ్గించడంలో ఉద్యోగులకు సపోర్టుగా నిలిచారని స్పష్టం చేశారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఎన్నికల నిర్వహణ మొదలు అన్ని పనులను టీచర్లతో చేయించి ఇబ్బందిపెట్టేవారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ శ్రమ దోపిడీ పరిస్థితి లేదన్నారు. టీచర్లను పాఠ్యాంశాల బోధనకు మాత్రమే పరిమితం చేయడం ద్వారా నేడు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఫలితాలు వస్తున్నాయని వివరించారు. అందుకే ప్రతి ఉద్యోగీ జగనన్న ప్రభుత్వానికే మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు.

కుప్పం మున్సిపాలిటీలో...

పంచాయతీగా ఉన్న కుప్పం పట్టణం రూపురేఖలను ప్రభుత్వం అద్భుతంగా మార్చేసింది. మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసి అభివృద్ధికి పునాది వేసింది. ముందుగా రూ.5 కోట్ల వ్యయంతో పురపాలక భవనం నిర్మించారు. గత రెండేళ్లలో మొత్తం రూ.66 కోట్లతో మౌలిక వసతులు కల్పించింది. పట్టణంలో తాగునీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరించింది. నాడు–నేడు కింద బాలుర ఉన్నత పాఠశాలను రూ.కోటితో ఆధునికీకరించింది.


కుప్పంలో నూతనంగా నిర్మించిన పురపాలక భవనం

మెరుగైన సదుపాయాలు



పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా కుప్పాన్ని మార్చడంతో మెరుగైన సదుపాయాలు సమకూరాయి. ప్రధానంగా తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఎక్కడికక్కడ డ్రైనేజీలు, సిమెంట్ రోడ్లు నిర్మించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలను అద్భుతంగా తీర్చిదిద్దారు. దీంతో విద్యార్థులు సైతం ప్రభుత్వ బడిలో చేరేందుకు.. చదివేందుకు ఆసక్తి చూపుతున్నారు.

- మురళి, కుప్పం

మాట నిలబెట్టుకునేవారికే..



ఇచ్చిన మాటను నిలబెట్టుకుని ప్రజల అవసరాలు తీర్చే నాయకుడికే అండగా ఉంటాం. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి ఎవరైతే నెరవేరుస్తారో వారి వెంటే నడుస్తాం. ప్రజలకు మౌలిక వసతులు కల్పించి, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పథకాలు అందిస్తారో వారికే మద్దతు ఇస్తాం.

- రమేష్, కుప్పం

కుప్పం రూరల్‌లో..

కుప్పం రూరల్ మండలంలోని చందం పంచాయతీ అభివృద్ధి పథంలో పయనిస్తోంది. సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటరు ఏర్పాటు కావడంతో రైతులు, ప్రజలు మండల కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. రోడ్ల వెంట వెళుతుంటే ప్రభుత్వం నిర్మించిన భవనాలు ఆకట్టుకుంటున్నాయి. ప్రజల అవసరాలను తీరుస్తున్నాయి.


నాడు -నేడు కింద అభివృద్ధి చేసిన కుప్పం బాలుర ఉన్నత పాఠశాల

గ్రామంలోనే సమస్యల పరిష్కారం



విజయ్, కొత్తయిండ్లు (04కెపి ఎం 21-300026) సచివాలయ వ్యవస్థ రావడంతో సమస్యలు గ్రామంలోనే పరిష్కారమవుతున్నాయి. ఇదివరకటిలా మండల కేంద్రం చుట్టూ తిరిగే బాధ తప్పింది. సచివాలయం, రైతుభరోసా, వెల్‌నెస్ సెంటర్ ఇక్కడే ఉండడం ఎంతో వెసులుబాటుగా ఉంది. పల్లెల్లో సిమెంట్‌రోడ్లు సైతం నిర్మించారు.

- విజయ్, కొత్తయిండ్లు

మమ్మల్ని ఆదుకునేవారికే మద్దతు



మహిళల సంక్షేమం అహర్నిశలు శ్రమించి, మమ్మల్ని ఆదుకునే వారికే మద్దతుగా నిలబడతాం. ఎక్కడికీ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందించిన నాయకుడికే అండగా ఉంటాం. ఎవరికీ పైసా లంచం ఇవ్వాల్సిన పనిలేకుండా పారదర్శకంగా లబ్ధి చేకూర్చిన వారికే మహిళలందరం తోడుగా ఉంటాం.

- రామలక్ష్మి, కొత్తయిండ్లు

'గుడ్'మార్నింగ్


చందం గ్రామంలో నిర్మించిన సచివాలయం

సంక్షేమం విరిసె.. అభివృద్ధి మెరిసె!

ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా 'సాక్షి' బృందం శనివారం కుప్పం నియోజక వర్గంలో రోడ్‌షో నిర్వహించింది. ఈ సందర్భంగా నాలుగు మండలాల్లోని గ్రామీణ ప్రాంతాలతోపాటు కుప్పం పట్టణంలో పర్యటించింది. ఈ క్రమంలో ముందుగా కుప్పం మండలం చందం గ్రామ పంచాయతీ కొత్తయిండ్లులో రోడ్‌షో ప్రారంభమైంది. అనంతరం మున్సిపల్ పరిధిలోని నేతాజీరోడ్డు, ప్యాలెస్ రోడ్డు మీదుగా సాగి గుడుపల్లెకు చేరుకుంది. అక్కడి నుంచి సి. బండపల్లె వద్ద శాంతిపురం మండలంలోని ప్రవేశించింది. రాళ్లబూదుగూరు, తుమ్మిశి రోడ్డు మీదుగా రామకుప్పం చేరుకోవడంతో రోడ్‌షో ముగిసింది. ఈ మార్గంలో ప్రజలను పలకరిస్తూ, వారి సాధక బాధకాలు తెలుసుకుంటూ సాక్షి బృందం ముందుకు సాగింది. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ఆరా తీసింది. సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని తెలుసుకుంది.

– కుప్పం/కుప్పంరూరల్/గుడుపల్లె/శాంతిపురం,/రామకుప్పం

- ప్రగతి పథంలో కుప్పం
- ప్రభుత్వ పథకాలతో లబ్ధిదారుల సంతోషం
- మేలు చేసేవారికే మద్దతు అంటున్న ప్రజానీకం

గుడుపల్లె మండలంలో...

గుడుపల్లెలో అధ్వానంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నాడు–నేడు పథకం కింద వెల్‌నెస్ సెంటర్‌గా మార్చి అభివృద్ధి చేశారు. ఇందులో సకల సదుపాయాలు సమకూర్చారు. ఖాళీ పోస్టులు భర్తీ చేసి పూర్తిస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తుండడంతో పేదలు తమ ఆరోగ్య సమస్యలకు చికిత్సలు పొందుతున్నారు.


గుడుపల్లె మండలంలో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్

ఆరోగ్య శ్రీ ఆదుకుంది



ప్రమాదవశాత్తు కాలు దెబ్బతింటే ఆపరేషన్‌కు వేల రూపాయలు అవుతుందని ఆస్పత్రి వారు తెలిపారు. ఈ సమయంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ నన్ను ఆదుకుంది. శస్త్రచికిత్సకు అయిన రూ.65 వేలలను ప్రభుత్వమే భరించింది. దీంతో పాటు మా కుమార్తె ప్రసవం కూడా ఉచితంగానే జరిగింది. ఈ పథకం ద్వారా మా కుటుంబం లక్ష రూపాయల వరకు లబ్ధిపొందింది.

- వరదరాజులు, గుత్తార్లపల్లె

రామకుప్పం మండలంలో..

రామకుప్పం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సుమారు 1.70 కోట్లు వెచ్చించి సిమెంటు రోడ్లు నిర్మించారు. కెంప సముద్రం గ్రామంలో నాడు–నేడు పథకం కింద జెడ్పీ హైస్కూల్‌ను ఆధునికీకరించారు. రామకుప్పంలో రూ.40 లక్షలు వ్యయంతో అదనంగా మరో నూతన సచివాలయ భవనం, రూ.50 లక్షలతో కెంపసముద్రంలో సచివాలయ భవనం, రూ.10 లక్షలతో బల్క్ మిల్క్ సెంటర్, రూ. 25 లక్షలతో హెల్త్ సెంటర్, మిట్టపల్లెలో రూ.21లక్షల వ్యయంతో రైతు భరోసా కేంద్రం, రూ.20 లక్షలతో వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం చేపట్టారు.


రామకుప్పంలో నిర్మించిన సిమెంటు రోడ్లు

రెండు పింఛన్లు వస్తున్నాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నా కుటుంబానికి అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయి. నాకు వితంతువు పింఛన్, నా కుమారుడికి దివ్యాంగుల పెన్షన్ వస్తోంది. అలాగే వైఎస్సార్ ఆసరా నగదు వచ్చింది. ఈ ప్రభుత్వంలో మేము చాలా సంతోషంగా ఉన్నాం. ఇలా పేదలను ఆదుకునేవారే మళ్లీ రావాలి. వారికే అండగా ఉంటాం.

- హసీనా, రామకుప్పం

అమలు చేసే హామీలే ఇవ్వాలి



ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు అమలు చేసే హామీలే ఇవ్వాలి. అధికారం కోసం ఇష్టానుసారం సాధ్యంకాని హామీలను ఇవ్వకూడదు. ఇప్పుడు ఎవరు హామీలు గుప్పించినా ప్రజలు తప్పకుండా ఆలోచిస్తారు. చెప్పింది చేసే వారి వెంటే నడుస్తారు. తమకు సక్రమంగా పథకాలు అందించేవారికే అండగా నిలబడతారు.

- విశ్వనాథరెడ్డి, బిరుగుండ్లపల్లె

శాంతిపురం మండలంలో..

మండలంలోని పంచాయతీల్లో ఎక్కడికక్కడ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు. సచివాలయ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజలకు ప్రభుత్వ సేవలను సకాలంలో అందిస్తున్నారు.


తుమ్మిశి-రాళ్లబూదుగూరు మార్గంలోని చిన్నారిదొడ్డి వద్ద నిర్మించిన ఆర్‌బీకే, సచివాలయ భవనాలు

అన్నీ అందుబాటులోకి వచ్చాయి :



సచివాలయం, రైతు భరోసా కేంద్రం అన్నీ మా ఊర్లోనే పెట్టారు. దీంతో ఏ పని ఉన్నా శాంతిపురానికి వెళ్లే కష్టం తప్పింది. సర్టిఫికెట్ కావాలన్నా అన్నీ ఇక్కడే అందుబాటులోకి వచ్చాయి. వలంటీర్లను ఏర్పాటు చేయటంతో పింఛన్లు, మిగతా పథకాలకు ఇంటి దగ్గరే అందుతున్నాయి. పథకాలు సొమ్ము నేరుగా మా ఖాతాలోనే పడుతోంది.

- భవానమ్మ, శాంతిపురం

మా కష్టం తెలిసిన వారికే..



మా లాంటి ముసలోళ్లు పింఛన్ కోసం గతంలో ప్రతి నెలా రోజుల తరబడి పంచాయితీ ఆఫీసు చుట్టూ తిరగాల్సి వచ్చేది. వలంటీరు సిస్టోళ్లను పెట్టాక ఒకటో తేదీ వస్తే వాకిలి తట్టి రూ.3వేల పింఛన్ చేతిలో పెట్టేవాళ్లు. మా యోగక్షేమాలు, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని సాయం చేసే వాళ్లు. ఇప్పుడు కొందరు దుర్మార్గుల కారణంగా ఇబ్బందులు పడుతున్నాం. అందుకే మా కష్టం తెలిసిన వారికే మద్దతు ఇస్తాం.

- చిన్నక్క, శాంతిపురం

వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ


మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన భాస్కర్, రాజశేఖర్ తదితరులు


మంత్రి రోజాతో పార్టీలో చేరిన నేతలు

పుంగనూరు : జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో వివిధ పార్టీలకు చెందిన నేతలు భారీగా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. అందులో భాగంగా ఆదివారం పుంగనూరు మండలం కీలకిరి గ్రామానికి చెందిన 50 మంది మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. స్థానిక నేతలు రాయల జగదీష్, ప్రభాకర్, వెంకట్రమణారెడ్డి, శంకరప్ప, నంజుండప్ప ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన భాస్కర్, రాజశేఖర్, చంద్రప్ప, సోమశేఖర్, సుబ్బరాయప్ప, మహేష్, లోకేష్, భరత్, వెంకటరమణ, సుబ్రమణ్యం, జి.భాస్కర్, శీనప్ప, ఏ.వెంకటరమణ, శ్రీరామాచారి తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరిపోయారు. అలాగే భరిణేపల్లెకు చెందిన బీసీవై నాయకుడు గంగాధర్ తన అనుచులతో కలిసి సర్పంచ్ గంగాధర్ , బాబు ఆధ్వర్యంలో చేరారు. సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దీన్ షరీఫ్, కౌన్సిలర్ అర్షద్‌అలీ, నాయకులు అస్లాం మురాధి ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన హసీనా, నజీర్, నవాజ్, షబ్నం, షాకీర్, దిల్‌షాద్, రాబియా, రుక్సానా, షబిన్‌తాజ్‌తో పాటు 15 మంది పార్టీలో చేరారు. కుమ్మరవీధికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అస్లాంమురాధి ఆధ్వర్యంలో టీడీపీ బూత్ కన్వీనర్ సయ్యద్ పార్టీలో చేరారు. దోబీకాలనీకి చెందిన మాజీ కౌన్సిలర్ శోభ, హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో బీసీవై పార్టీ వలంటీర్లు వెంకటలక్ష్మీ, జ్యోతి, శక్తి, లావణ్య చేరారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దేశిడొడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


టీడీపీ నేతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

నగరిలో..

నగరి : పట్టణంలోని 24వ వార్డు కౌన్సిలర్ బీడీ భాస్కర్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు సంధ్య, శకుంతల, తులసి, సరస్వతి, సెల్వి, రాజేశ్వరి, వసంత, భారతి, లక్ష్మి, గాయత్రి, యశోద, జయంతి, మీనా, ఇంద్రాణి, మీనాక్షి, మహాలక్ష్మి, దేవా, ఎస్‌డి బాలాజీ, ఎస్‌డి మని, బీజే శోభన, మోహన, వేండా, జయమ్మ, సుమతి తదితర 150 కుటుంబాలవారు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి రోజా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మేళపట్టు గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుదర్శన్ నాయుడు, సర్పంచ్ ప్రకాష్, డీసీసీ బ్యాంక్ డైరెక్టర్ నాగరత్నం, సచివాలయ కన్వీనర్ రామ్మూర్తి, హేమాద్రి యాదవ్, శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నేతలు ఆర్.వినోద్, ఏ.గంగయ్య, ఎం.ప్రభు, జి.రఘు, ఎం.అయ్యప్ప, ఏ.గుణశేఖర్, ఎస్.రంజిత్ కుమార్, కె.నరేష్, కె.రాముడు, జి.వీరా స్వామి, ఎం.నగేష్, బి.ఢిల్లీ, ఆర్.సతీష్, ఎం.రమేష్, జి.అయ్యప్ప, జి.సురేష్, కే.ఎలుమలై, కే. కృష్ణ, వై.మురళి, ఎ.దేశప్ప, ఎస్.దేశప్ప, తులసిరామన్, లక్ష్మణ్ తదితరులు తమ కుటుంబాలతో సహా వైఎస్సార్‌సీపీలో చేరారు. మిట్టపాళెం సర్పంచ్ వినోద్ ఆధ్వర్యంలోటీడీపీ నాయకులు జగన్, శివ, సురేష్, మాసిలామణి, సతీష్, ఆనంద్, రాజేష్, అప్పన్, నటరాజన్, సురేష్, రాజకుమార్, వేలు తదితరులు తమ కుటుంబాలతోపార్టీలో చేరారు. జెడ్పీటీసీ సభ్యుడు గాంధీ, ఆర్‌బీకే చైర్మన్ బుజ్జి రెడ్డి, నాయకుడు నాగవేల్ రెడ్డి పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలంలోని బొమ్మరాజుపల్లెకు చెందిన టీడీపీ నేత కేశవరెడ్డికి రెండు రోజుల క్రితం అమరనాథరెడ్డి కండువా కప్పి వైసీపీ నాయకుడు టీడీపీలో చేరినట్లు కలరింగ్ ఇచ్చారు. దీంతో మనస్తాపం చెందిన కేశవరెడ్డి ఎమ్మెల్యే వెంకటేగౌడ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

చిత్తూరులో..

చిత్తూరు కార్పొరేషన్: గుడిపాల మండలం 197 రామాపురం పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు 13 మంది వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జనార్ధన్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో వెంకటేష్‌యాదవ్, బాలాజీయాదవ్, ప్రసాద్‌యాదవ్, రాజేష్, నరసింహులు, సాంబశివనాయుడు, మురగయ్య, మోహన్, అభి, రాజాశేఖర్, చెంగల్రాయులు, పయణి, విక్కీ ఉన్నారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: మండలంలోని టీడీపీకి చెందిన 40 కుటుంబాల వారు ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్‌జే భరత్ సతీమణి దుర్గా, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, సర్పంచ్ దేవరాజు, అమరనాథ్, ఎంపీటీసీ సభ్యులు సందరం రాజేశ్వరి, సింగిల్ విండో చైర్మన్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

గంగవరంలో..

గంగవరం : గండ్రాజుపల్లి పంచాయతీ అల


పార్టీలో చేరిన టీడీపీ నేతలతో మంత్రి రోజా


మేళపట్టు నేతలతో మంత్రి రోజా


టీడీపీ వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న దుర్గ, సెంథిల్‌కుమార్


పార్టీలో చేరినవారితో విజయానందరెడ్డి


పార్టీలో చేరిన హసీనా, నజీర్ తదితరులతో మంత్రి పెద్దిరెడ్డి


మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన బీసీవై నాయకుడు గంగాధర్


పార్టీలో చేరిన బీసీవై కార్యకర్తలతో మంత్రి పెద్దిరెడ్డి


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే వెంకటేగౌడ

కుప్పం గ్రామస్తులు టీడీపీని వీడి ఎమ్మెల్యే వెంకటేగౌడ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరిలో శశికుమార్, దీపక్‌బాబు, నాగేష్, వినోద్ కుమార్, హరీష్, అనిల్‌కుమార్, సతీష్, భానుప్రకాష్, యశ్వంత్, చిన్నప్పయ్య ఉన్నారు.